క్లుప్తంగా

క్షేత్రస్థాయిలో పర్యటించి లోపాలు సవరించాలి

• ఆర్డీఓ సాయిశ్రీ


అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ

బొబ్బిలి: ఓటరు జాబితాల్లో తప్పులు, ఒప్పులను సవరించేందుకు ఎన్నికల సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆర్డీఓ ఎ.సాయిశ్రీ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కస్టోడియన్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో లోపాలను సవరించాలని వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సరైనదో కాదో నిర్ధారించుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, నాలుగు మండలాల తహసీల్దార్లు ఎస్.కిరణ్‌కుమార్, ఎస్.రాజారావు, సులోచనారాణి, దిలీప్ చక్రవర్తి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణమస్తు లబ్ధిదారుల గుర్తింపు

రేగిడి: వైఎస్సార్ కళ్యాణమస్తు పథకం కోసం దరఖాస్తు చేసిన వారి వివరాలను ఏపీఎం జి.గోవిందరావు మంగళవారం పరిశీలించారు. మండలంలో పెద్దశిర్లాం గ్రామంలో పర్యటించి దరఖాస్తుదారుల అర్హతలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. అర్హులకు పథకాన్ని వర్తింపచేస్తామన్నారు. ఆయనతో పాటు సర్పంచ్ లెంక రాంబాబు, సీసీలు, సీఎఫ్‌లు ఉన్నారు.

కౌలు రైతులకు పంట రుణాలు

రాజాం సిటీ: కౌలు రైతులకు ఏపీజీవీబీ ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ ఎం.రేణుకాసాయి అన్నారు. రుణాలు పొందేందుకు అర్హులైన కౌలురైతుల వివరాలను పొగిరి ఏపీజీవీబీ మేనేజర్ రమాకాంత్‌కు మంగళవారం అందజేశారు. జాబితాలో ఉన్న రైతులకు రుణాలు అందించాలని బ్యాంకు మేనేజర్‌ను కోరారు. కౌలు రైతులు తమ పరిధిలోని బ్యాంకులకు వెళ్లి పంట రుణాలు పొందాలని సూచించారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లో మంగళవారం ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యుడు ఎస్.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. కీళ్లనొప్పులు, రక్తపోటు, మధుమేహం, చర్మవ్యాధులతో బాధపడుతున్న పలువురికి వైద్య తనిఖీలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

నకిలీ పురుగు మందులు విక్రయిస్తే చర్యలు

రేగిడి: నకిలీ పురుగుమందులు, విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఓ జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని బూరాడ, పనసలవలస గ్రామాల్లో ఉన్న ఫెర్టిలైజర్స్ దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. పురుగు మందులు, ఎరువుల స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. అధికారులు సూచించిన పురుగు మందులు, ఎరువులు విక్రయాలు చేయాలని, రైతులను మోసగించే ప్రయత్నాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బాడంగి: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.రామదాసు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు, ఇంటర్‌లో ప్రవేశానికి ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9492024167కు ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

రామభద్రపురం: ఈవీఎంల వినియోగంపై రెవెన్యూ సిబ్బంది అవగాహన కల్పించారు. తహసీల్దార్ ఎ.సులోచనరాణి ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది పర్యటించి ఈవీఎంలపై ఎలా ఓటు వేయాలో ఓటర్లకు వివరించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం వద్ద పలువురు నాయకులు, ప్రజలకు తహసీల్దార్ సులోచనరాణి ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రలోభాలకు లొంగకుండా తమకు నచ్చిన వారికి ఓటు వేయాలని సూచించారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి

బొబ్బిలి: రాజ్యాంగ పరిరక్షణ కోసం రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని గద్దెదించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక అధ్యక్షుడు ఎ.అజశర్మ అన్నారు. స్థానిక షాదీఖానాలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి అధ్యక్షతన 'లౌకిక వాదం–రాజ్యాంగ పరిరక్షణ' అనే అంశంపై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొట్టి ఎన్నికలకు వెళ్తోందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని ప్రజలకు పలుపునిచ్చారు.

మహిళా సాధికారతకు 'ఆసరా'

• అన్నివర్గాల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం
• వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్


ఆసరా చెక్కును అందజేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

సంతకవిటి: మహిళల ఆర్థిక సాధికారతే సీఎం జగన్ అజెండా అని, అందులో భాగంగానే మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. సంతకవిటిలో మంగళవారం నిర్వహించిన 'వైఎస్సార్ ఆసరా' సంబరాల్లో వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌తో కలిసి పాల్గొన్నారు. మహిళా సంఘాల సభ్యులకు ఆసరా చెక్కును అందజేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మాత్రమే టీడీపీ ప్రజల్లోకి వస్తుందని, కానీ ఎన్నికలతో సంబంధం లేకుండా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని గుర్తుచేశారు. అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలు మహిళలను ఆర్థికంగా బలోపేతం చేశాయని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో అందుతున్న సంక్షేమ పాలన, అభివృద్ధి పాలన దేశానికికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇటువంటి సంక్షేమ పాలన అందివ్వలేదని గుర్తుచేశారు. ఎన్నికలు సమీపించడంతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆ పార్టీ నాయకులు అబద్ధాలతో ప్రజలను ప్రలోభాలకు గురిచేసి ఓట్లు దండుకునేందుకు వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

దమ్మున్న నాయకుడు సీఎం జగన్

గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య తేడాలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు అన్నారు. గతంలో జన్మభూమి కమిటీలతో దోచుకున్నారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పారదర్శక పాలన అందుతోందన్నారు. మీకు మేలు జరిగిందనిపిస్తేనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయండని అడిగే దమ్ము సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే ఉందన్నారు. ప్రజలు గత పాలనకు, వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాలు గమనించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీలు సిరిపురపు మంజుల, ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, పండు పాపారావు, రాజాం జెడ్పీటీసీ బండి నర్సింహులు, పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ గురుగుబెల్లి స్వామినాయుడు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, వైకేపీ ఏపీ ఎ.చిరంజీవి, ఏపీఎం సీతారాం, మండల మహిళా అధ్యక్షులు సుశీల, సంతకవిటి మాజీ సర్పంచ్ గురాల జగన్మోహనరావు, సంతకవిటి ఎంపీటీసీ సభ్యులు పాట్నూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మేకలు కొనుక్కున్నాను



నాకు వైఎస్సార్ ఆసరా కింద ఏడాదికి రూ.9500లు చొప్పున అందింది. ఈ నగదుతో మేకలు కొనుగోలు చేశాను. కుటుంబానికి ఆర్థికంగా నిలిచాను. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు మరువలేను.

– ఉరదండం మల్లీశ్వరి, జయరాం మహిళా సంఘం, మండాకురిటి

ఆశీర్వదించండి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గతంలో టీడీపీ నేత చంద్రబాబునాయుడు మహిళా సంఘాల రుణాలు మాఫీ చేస్తామని చెప్పి చేయకుండా మోసం చేశారని గుర్తుచేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు విడతల్లో డ్వాక్రా సంఘాల రుణాలు మాఫీ చేయడం జరిగిందన్నారు. ఇన్నాళ్లూ ఓ డాక్టర్‌గా మీకు సేవలందించానని, రేపు జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మీరంతా నన్ను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా మీకు సేవ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు.


సభకు హాజరైన మహిళా సంఘాల సభ్యులు

సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించాలి

• వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్


ప్రజల మద్దతు కోరుతున్న డాక్టర్ తలే రాజేష్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

రాజాం: ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్లుగా అమలుచేసిన సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ పార్టీ కార్యకర్తలకు సూచించారు. పట్టణంలోని ఆదర్శనగర్, అమ్మవారి కాలనీ, బొబ్బిలి సెంటర్ ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలు సంఘాల పెద్దలతో మంగళవారం మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో గెలుపొందేలా కృషిచేయాలని కోరారు. ఈ నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ ఇంటికి కనీసం రూ.1 లక్షకు తగ్గకుండా లబ్ధి చేకూర్చారని, ఇదే విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, నాయకులు డాక్టర్ నాగేంద్ర, జిల్లా కార్యదర్శి రాజుమాస్టారు, యందవ సూరి, యందవ చినబాబు, సత్యనారాయణ, ఓలేటి గణపతి, వెంపల లక్ష్మణరావు, జేసీబీ శ్రీను, ముద్దన సత్యారావు, సలాది తులసీ మాస్టారు, ఆర్.జయరాం, కంబాల సుధ, చప్పటి పెంటయ్య, నెట్టి సత్యనారాయణ, లలితకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

• ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో ప్రతీ కుటుంబం లబ్ధి పొందిందని, మేలు చేసిన ప్రభుత్వాన్ని మరవకుండా ఆశీర్వదించాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 17 సచివాలయాల పరిధిలో ఈ నాగున్నరేళ్లలో డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో 1,10,118 మంది లబ్ధిదారులకు సుమారు రూ.323.05 కోట్ల లబ్ధిజరిగిందన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, రైతుభరోసా, పంటల బీమా, సున్నా వడ్డీ, మత్స్యకార భరోసా, పెన్షన్ కానుక, వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, కళ్యాణమస్తు, ఆరోగ్య శ్రీ, వైఎస్సార్ బీమా, వాహన మిత్ర, తదితర సంక్షేమ పథకాలు ద్వారా 84,695 మందికి రూ.247.80 లక్షలు నేరుగా వారి ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. అలాగే ఇంటి పట్టాలు, విద్యాకానుక, ట్యాబ్‌లు, జగనన్న తోడు, గోరుముద్ద, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, తదితర పథకాలు 25,423 మంది లబ్ధిదారులకు రూ.75.25 కోట్లు నాన్ డీబీటీ రూపంలో అందాయని వివరించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో చాలా మంది ఆర్థికాభివృద్ధికి పునాదులు వేసుకున్నారని అన్నారు. మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు, కనిమెరక అప్పారావు పాల్గొన్నారు.

టీడీపీలో కోండ్రు కిరికిరి

• కళా వర్గీయులకు కండువాలు కప్పి ప్రచారం
• టీడీపీ వాళ్లకే మళ్లీ పార్టీ కండువాలు
• మండిపడుతున్న కళావర్గం


అప్పాపురంలో టీడీపీ కార్యకర్తలకే మళ్లీ కండువాలు వేస్తున్న కోండ్రు మురళీమోహన్

రేగిడి: రాజాం నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్‌కు రోజురోజుకు అసమ్మతి వర్గం పెరుగుతోంది. దీనిని తట్టుకోలేని కోండ్రు... అసమ్మతి వర్గానికి మరికొంత కోపం తెప్పించేలా వ్యవహరిస్తున్నారు. తనను వ్యతిరేకిస్తున్న రేగిడి, సంతకవిటి మండలాల్లోని టీడీపీ నేతలను టార్గెట్ చేశారు. ప్రస్తుతం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నవారిని కాదని, రెండో వర్గాన్ని తన వెంట తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. స్తబ్దతగా ఉన్న వారికి పార్టీ కండువాలు వేస్తూ ఫోజులిస్తున్నారు. టీడీపీలో కొత్తక్యాడర్ చేరిందటూ రేగిడికి చెందిన కిమిడి కుటుంబీకులను, ఇటు సంతకవిటి మండలానికి చెందిన కొల్ల అప్పలనాయుడు వర్గాన్ని రెచ్చగొడుతున్నారు. ఇందులో భాగంగానే రెండురోజుల కిందట రేగిడి మండలం అప్పాపురం పంచాయతీకి చెందిన టీడీపీ కార్యకర్తలైన మజ్జి సూర్యనారాయణ, బాలిశెట్టి సంజీవరావు, వంకాయల రామకృష్ణ, శాసుబిల్లి వైకుంఠరావు, కొమ్ము లక్ష్మీనారాయణ తదితరులు టీడీపీలో చేరినట్టు ప్రచారం చేసినట్టు సమాచారం. వాస్తవంగా వీరు గతంలో కళా వెంకటరావు వర్గీయులు. ప్రస్తుతం వీరికే కండువావేసి కళావర్గాన్ని కవ్విస్తున్నారు. ఇప్పటికే కోండ్రును వ్యతిరేకిస్తున్నవారు దీనిని చూసి మరింత మండిపడుతున్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయండి: ఈఆర్వో


రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షిస్తున్న ఈఆర్వో జోషఫ్

రాజాం: ఓటరు జాబితాల్లో ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా వెంటనే బీఎల్ఓలకు, సంబంధిత మండల తహసీల్దార్ కార్యాలయంలో తెలియజేయాలని రాజాం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్.జోషఫ్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. బీఎల్ఓలు, గ్రామ సచివాలయాల్లో ఆయా గ్రామాలకు చెందిన ఓటర్ల జాబితాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని పరిశీలించి తప్పులు ఏమైనా ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్రామాల్లో బీఎల్ఓల పనితీరుపై ఆరాతీశారు. కార్యక్రమంలో రాజాం తహసీల్దార్ ఎస్.కె.రాజు, ఎన్నికల డీటీ ప్రకాష్, డీటీ వెంకటేష్, ఆర్ఐ సాగర్ పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి


అధ్యాపకులకు సూచనలు చేస్తున్న డీవీఈఓ భీమశంకర్

రాజాం: ఇంటర్మీడియట్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా డీవీఈఓ(డిస్ట్రిక్ట్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్) భీమశంకర్ సూచించారు. రాజాం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత నాడు–నేడు పనులు పరిశీలించారు. అనంతరం విద్యార్థినిలు, అధ్యాపకులతో సమావేశమయ్యారు. త్వరలో జరుగునున్న పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని, రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు కృషిచేయాలని అధ్యాపకులకు సూచించారు. ఆయనతో పాటు కె.జనార్దనరావు ఉన్నారు.

భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి

తెర్లాం: విద్యార్థులు బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు సూచించారు. మండలంలోని కుసుమూరు, నందిగాం, రాజయ్యపేట పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని, చదువుపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆయనతో పాటు తెర్లాం ఎస్ఐ ఆర్.రమేష్, ఏఎస్ఐ మల్లేశ్వరరావు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం


అప్పలనాయుడు (ఫైల్)

రాజాం సిటీ: పొనుగుటివలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రెడ్డి అప్పలనాయుడు(80) మంగళవారం మృతిచెందారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎస్వీ రమణారావు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన నాయకులు, రైతు సంఘ నాయకులు, ఉపాధ్యాయ సంఘాలు అప్పలనాయుడు మృతికి నివాళులర్పించారు.

పశువైద్య శిబిరం

రామభద్రపురం: మేలు జాతి పశు సంపద కోసం కృత్రిమ గర్భధారణ ఉత్తమ విధానమని రామభద్రపురం, ఆరికతోట పశువైద్యాధికారులు హిరణ్య, డి.సురేష్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, గర్భధారణ ఇన్‌జక్షన్లు వేశారు. పశుపోషణపై పాడిరైతులకు అవగాహన కల్పించారు.

సంక్షిప్తంగా...

ఈకేవైసీ తప్పనిసరి

రేగిడి: మండలంలోని ప్రతీ రైతు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వన్నలి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఈకేవైసీని మంగళవారం పరిశీలించారు. రైతులు పండించిన పంటను రైతు భరోసా కేంద్రాలకు విక్రయించాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం..

బొబ్బిలి: పట్టణ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ అన్నారు. మున్సిపాలిటీలోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఆయన వెంట వార్డు ఇన్‌ఛార్జి చంద్రపూడి రమేష్ ఉన్నారు.

31 మద్యం సీసాలు స్వాధీనం

బొబ్బిలి: మండలంలోని కమ్మవలస, అలజంగి గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసినట్టు సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. కమ్మవలసలో మద్యం విక్రయిస్తున్న పూతి అప్పన్నను, అలజంగిలో మద్యం అమ్ముతున్న పైల మంగమ్మను అదుపులోకి తీసుకుని వారి వద్ద 31 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

బొబ్బిలి: పుస్తక పఠనంతో విజ్ఞానం లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అన్నారు. విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన, విక్రయశాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైన్స్ కళాజాతా

రాజాం సిటీ: పొనుగుటివలస గ్రామంలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్సు కళాజాతా నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 18 వరకు అన్ని జిల్లాలో కళాకారులతో సైన్సుపై నృత్యరూపకాలు, నాటికలు, గీతాలాపన, మ్యాజిక్ ప్రదర్శన, ప్రయోగాలు వంటివి ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర నాయకులు గొంటి గిరిధర్, జిల్లా ఉపాధ్యక్షుడు శాసపు సత్యనారాయణ, మక్క అప్పలనాయుడు, గట్టి పాపారావు, వేదిక గౌరవ అధ్యక్షుడు జరజాన నీలయ్య పాల్గొన్నారు.

మీడియాపై దాడి దారుణం

బొబ్బిలి: చింతలపూడిలో చింతమనేని ప్రభాకర్, అతని అనుచరులు మీడియాపై దాడి చేయడాన్ని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, ఆర్.వ్యాస్‌బాబు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మీడియా ప్రతినిధులమని, విలేకరులమని చెపుతున్నా వినకుండా, వారి వద్ద నుంచి కెమెరాలు లాక్కొని నెట్టివేయడం, దుర్భాషలాడటం దారుణమన్నారు. ఇది ఎంత మాత్రం సమంజసం కాదని, ఇటువంటి దాడులకు తెగబడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

బొబ్బిలి: పట్టణంలోని గొడవీధిలో స్థానిక అభ్యుదయ ఉన్నత పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 215 మందికి సాగరదుర్గ, సింహాద్రి ఆస్పత్రులకు చెందిన వైద్యులు వైద్య సేవలందించారు. శస్త్రచికిత్సలు అవసరమైన 21 మందికి పలు ఆస్పత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎంకే నాయుడు, ప్రిన్సిపాల్ చింత శారద, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

రాజాం: మండలంలోని శ్యాంపురం గ్రామంలో సుబ్బమ్మవాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ కె.సాయిరాం మంగళవారం పరిశీలించారు. జాబ్ కార్డులు ఉన్నవారు మాత్రమే పనులకు హాజరుకావాలని సూచించారు.

ఎంపీ పరామర్శ


రాజాం సిటీ: క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుంటున్న ఎంపీ చంద్రశేఖర్

రాజాం సిటీ: వంగర మండలం పెదరాజులగుమ్మడ వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన వారిని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పరామర్శించారు. స్థానిక జీఎంఆర్ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల వద్ద ఆరాతీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రికి ఎండీ డాక్టర్ డి.రాజేంద్రకు సూచించారు. ఎంపీ వెంట వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, తదితరులు ఉన్నారు.

రేగిడి: మండలంలో సంకిలి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు మజ్జి సంధ్యాశ్రీనివాసరావును విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మంగళవారం పరామర్శించారు. ఇటీవల శ్రీనివాసరావు తల్లి సత్తెమ్మ మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ గ్రామానికి చేరుకుని శ్రీనివాసరావుతో పాటు అతని సోదరుడు మజ్జి గణపతిరావును, కుటుంబ సభ్యులను పరామర్శించారు. సత్తెమ్మ చిత్రపటం వద్ద పూలువేసి నివాళులర్పించారు. ఆమె మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, మాజీ సర్పంచ్ రాయపురెడ్డి కృష్ణారావు, సర్పంచ్ బుడుమూరి పట్టాభి, తదితరులున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు


రాజయ్యపేటలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ తిరుమలరావు

తెర్లాం: మండలంలో కుసుమూరు, నందబలగ, రాజయ్యపేట తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు మంగళవారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిసారించినట్లు చెప్పారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో ఎటువంటి తగాదాలు, గొడవలు లేకుండా ప్రజలంతా శాంతియుతంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట తెర్లాం ఎస్సై ఆర్.రమేష్ ఉన్నారు.

గురుకుల విద్యార్థులకు వైద్య పరీక్షలు

రేగిడి: ఉంగరాడమెట్ట వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రేగిడి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది మంగళవారం వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, రోడ్లపై విక్రయించే ఆహార పదార్థాలను తినొద్దని, ఉతికి ఆరబెట్టిన దుస్తులను మాత్రమే ధరించాలని సూచించారు. విద్యార్థులకు భోజన సమయంలో వేడి ఆహార పదార్థాలతో పాటు కాచి చల్లార్చిన నీటిని అందించాలని ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజుకు సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్ రమణ, గురుకుల పాఠశాల హెల్త్ అసిస్టెంట్ తాడేల శ్రీనివాసరావు వైద్య సేవలందించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

మెంటాడ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరమని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని గుర్ల తమ్మిరాజుపేట గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. జగనన్న సురక్ష కార్యక్రమంతో ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని ఎంపీడీఓ పి.రవికుమార్ అన్నారు. మండలంలోని అలజంగిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యశిబిరాన్ని పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

రామభద్రపురం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా పేదలకు నాణ్యమైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని డాక్టర్ ఏఎల్‌జీ శిరీష అన్నారు. మండలంలోని జన్నివలస సచివాలయం పరిధిలో మంగళవారం ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. శిబిరంలో వైద్యులు కె.పుష్పలత, డి.గౌరి, బి.త్రినాథ, పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.వాసుదేవరావు సేవలందించారు.